క్లుప్తంగా

భోగేశ్వరాలయం ఈఓగా రామానుజన్


బాధ్యతలు స్వీకరిస్తున్న రామానుజన్

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఎర్రమల కొండలలో వెలసిన దుర్గాభోగేశ్వరాలయం ఈఓగా వీఎల్ఎస్ రామానుజన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నందవరం చౌడేశ్వరీ ఆలయం ఈఓగా పనిచేస్తున్న రామానుజన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖరరెడ్డి యాంగటి దేవస్థానానికి బదిలీ అయ్యారు. నూతన ఈఓను ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది మర్యాద పూర్వకరంగా కలిశారు.

సచివాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


సి.బెళగల్ - 1 సచివాలయంలో రికార్డు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: ఉద్యోగులు సచివాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని సచివాలయం - 1ను తనిఖీ చేశారు. కార్యాలయం అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ పరిశుభ్రతతో పాటు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం పలు వీధుల్లో పర్యటించి ఎన్నికల నియమావళిని తెలియజేశారు. ఆమె వెంట ఏపీఓ లక్ష్మన్న ఉన్నారు.

సుబ్రమణ్యేశ్వరస్వామికి రూ.12.60 లక్షల ఆదాయం


హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకలను లెక్కించారు. రూ.12,60,951 నగదు, 12 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారం, 1 కేజీ 102 గ్రాముల వెండీ సమకూరినట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. జనవరి 25 నుంచి ఈనెల 30వ తేదీ వరకు స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ అధికారి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరంలో నంద్యాల డీఎస్పీ పూజలు


దుర్గా భోగేశ్వర స్వామి సన్నిధిలో డీఎస్పీ కుటుంబ సభ్యులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఎర్రమల కొండలలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామిని నంద్యాల డీఎస్పీ సంతోష్‌కుమార్ శర్మ దర్శించుకున్నారు. శనివారం ఆయన కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తదితరులు డీఎస్పీ కుటుంబ సభ్యులను సన్మానించి, వేదాశీర్వచనం చేయించారు. స్వామి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

కర్ణాటక భక్తుల పాదయాత్ర


సి.బెళగల్‌లో పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్న కర్ణాటక భక్తులు

సి.బెళగల్: కర్ణాటక భక్తుల పాదయాత్ర శనివారం మండలంలో మొదలైంది. పొరుగు రాష్ట్రం కర్ణాటక భక్తులు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున, భ్రమరాంబికాదేవిల దర్శణానికి పాదయాత్రగా సీ.బెళగల్ మండల కేంద్రం మీదుగా బయలుదేరారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థలో(ఏపీఆర్ఈఐఎస్) ప్రవేశాలకు దరఖాస్తుల చేసుకోవాలని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. 2024–25 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతులలో 38 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా ఉర్దూ పాఠశాలలో చేరాలనుకునే మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉండదన్నారు.

రమణీయం.. లక్ష్మీమాధవుడి రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన గోరంట్ల


గోరంట్ల మాధవస్వామికి పూజలు నిర్వహిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డా.సతీష్


అశేషజనవాహిని మధ్య సాగుతున్న శ్రీలక్ష్మీమాధవస్వామి రథోత్సవం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాకా కర్ణాటక, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలతో శ్రీలక్ష్మి, భూదేవి మాధవస్వాముల విగ్రహాలను రథంపై ఆశీనులను చేయగా, భక్తుల గోవిందనామస్మరణ మధ్య రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథోత్సవం సందర్భంగా కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో కోడుమూరు,గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసింహులు, హనుమంతు, తిమ్మారెడ్డిలు తమ సిబ్బంది తో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

ప్రముఖుల పూజలు
శ్రీలక్ష్మీమాధవస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ గోరంట్లకు చేరుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ తదితరులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.

రూ.1.50 లక్షల నగదు సీజ్

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో నగదు సీజ్ చేసినట్లు సీఐ నల్లప్ప తెపారు. ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అహ్మద్‌బాషా, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న ఏపీ 21బిఎం8818 నంబర్ కారులో డోన్ పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి రాజవిజయసుబ్రమణ్యం వద్ద నుంచి రూ.1,50,000 స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

4 నుంచి ఈతకోలను ప్రారంభం

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4 వ తేదీ నుంచి స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్‌పూల్ (ఈత కోలను) ప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈత కోలనులో సభ్యత్వం పొందేందుకు 6 సంవత్సరాల వయస్సు పూర్తి అయి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తుల కోసం స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు సంప్రదించాలని తెలిపారు. ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పండి

– ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కల్లూరు అర్బన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేదప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు జతకట్టిన ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని గురు బ్రహ్మనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ అవ్వాతాతలను, మహిళలను, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు అధికారం కోసం మాయ మాటలు చెబుతారని వారిని నమ్మొద్దన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత జగన్ పాలనకు మధ్య గల తేడాను గమనించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి పథకం ఇంటి వద్దకే వచ్చిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అందించామన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డులలోని స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కాటసానిని మరోసారి గెలిపించండి

- పాణ్యం అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ


కొత్తూరులో ప్రచారంలో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ

పాణ్యం: పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి ఉమామహేశ్వరమ్మ కోరారు. శనివారం మండల పరిధిలోని కొత్తూరు, గగ్గటూరులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో చేసిన మంచి పనులను వివరించి ఓటు వేయాలని కోరారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు రాంభూపాల్‌రెడ్డి అని, అలాంటి నాయకుడిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణేశ్వస్వామి ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామి అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, సర్పంచ్‌లు రాజేశ్వరమ్మ, డాక్టర్ సుష్మా, పద్మావతి, నాయకులు శ్రీనివాసరెడ్డి, క్రిష్టారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీరయ్య, శివరామిరెడ్డి, నాగేంద్ర, బాబు, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు


నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న దృశ్యం

కల్లూరు: దళిత ద్రోహి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ అన్నారు. అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేని చంద్రబాబు వీరాంజనేయులును అవమానించేలా వ్యాఖ్యనించారన్నారు. బాబు తీరును నిరసిస్తూ శనివారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన చేశారు. చంద్రబాబు దళిత ద్రోహి అంటూ నినాదాలు చేశారు. అనంతరం శివ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీలంటే చులకన్నారు. ఉన్నత చదువులు చదివిన వీరాంజనేయులు కుటుంబ పోషణ కోసం టిప్పర్ నడపడం తప్పా? అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఎస్సీలందరూ కలిసి బాబును శాశ్వతంగా ఇంటికి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు దాసరి మోహన్‌రాజు, రాజేష్, మనోరాజు, సురేష్, రాజు, గోపినాథ్, హుస్సేన్ సాహెబ్, బాషా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బైపోలార్ వ్యాధిపై అవగాహన పెరగాలి

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో బైపోలార్ డిజార్డర్‌పై అవగాహన పెరగాలని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. ప్రపంచ బైపోలార్ డేను పురస్కరించుకుని శనివారం పెంచికలపాడు సమీపంలోని విశ్వభారతి వైద్య కళాశాలలో మనోరోగ చికిత్స విభాగం ఆధ్వర్యంలో మెడికోలు, పీజీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బైపోలార్ అనారోగ్యం గురించి వివక్షను తగ్గించేందుకు, చికిత్స తీసుకునేందుకు రోగులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 30వ తేదీన బైపోలార్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో దాదాపు 40–45లక్షల మంది రోగులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహ్మద్, సైకియాట్రి విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ శివశంకర్‌రెడ్డి, సీనియర్ రెసిడెంట్లు డాక్టర్ అబూజార్ రహిమాన్, డాక్టర్ వీరేంద్ర పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్



పాణ్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం


గడివేములలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రంలోని షాలేము ప్రార్థన మందిరం నుంచి పాణ్యం వరకు క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు. దేవుని మార్గాలు, త్యాగాలు, మహిమలను గురించి పాస్టర్లు ప్రజలకు వివరించారు.

గడివేములలో..
గడివేముల: మండల కేంద్రంలోని ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రధాన రహదారిలోని జెడ్పీ స్కూల్ వద్ద నుంచి ఏబీఎం చర్చి వరకు కార్యక్రమం కొనసాగింది. సామేలు, కో–ఆర్డినేటర్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరు

- మూడోసారి కోడుమూరు గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుంది
- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి సతీష్


మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఎమ్మెల్యే అభ్యర్థి డా.సతీష్

కోడుమూరు రూరల్: జగనన్న ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరని, వచ్చే ఎన్నికల్లో కోడుమూరులో మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి సతీష్ అన్నారు. శనివారం కోడుమూరులో వారు విలేరులతో మాట్లాడుతూ రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. శుక్రవారం కోడుమూరు, ఎమ్మిగనూరులలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం సభ, బస్సు యాత్రలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనే అందుకు నిదర్శనమన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్ర, సభలకు ప్రజల నుంచి వచ్చిన స్పందనతో టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఇంటింటికి సంక్షేమ ఫలాలందించిన జగనన్నను ప్రజలంతా మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు, అపద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. మూడోసారి కోడుమూరు కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి, జగనన్నకు బహుమతిగా ఇస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర, సభను విజయవంతం చేసిన ప్రజలందరికి తాము రుణపడి ఉంటామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ ఉపసర్పంచు మాదులు, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, రాఘవేంద్ర, లింగన్న, లింగమూర్తి, డిష్ రవి, కట్టెల శ్రీనివాసులు, శివరాముడు, విష్ణుదాసు, సీబీ కరుణ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తా ఫ్లై ఓ వర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరులోని రామకృష్ణనగర్‌కు చెందిన మణికుమార్ (29) మృతిచెందాడు. మణికుమార్ అతని స్నేహితుడు శివతో కలసి శుక్రవారం అర్ధరాత్రి బుల్లెట్ వాహనంపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా ఇంటికి వెళ్తుండగా మినీ లారీ అసోసియేషన్ కార్యాలయం ఎదురుగా బ్రేక్ డౌన్ అయి ఆగివున్న లారీని ఢీకొట్టడంతో మోటర్‌సైకిల్ నడుపుతున్న మణికుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న శివకు కూడా రక్తగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి 108 అంబులెన్స్‌లో ఇరువురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరిశీలించి మణికుమార్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గాయాలకు గురైన శివకుమార్ మాత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపారు.

మూగజీవాల సంరక్షణకు ప్రభుత్వం అండ

- పశువులకు వైద్యం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1962
- వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యులు


పందిరి కింద సేదతీరుతున్న బర్రెలు

పాణ్యం: పాడిపై ఆధారపడిన రైతులకు జగనన్న ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అండగా నిలిచింది. మూగజీవాల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. టోల్ ఫ్రీ నంబర్, అంబులెన్స్ ఏర్పాటు చేసిసి జీవాలు అనారోగ్యానికి గురైన సమయంలో 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు పశువైద్య సిబ్బంది అంబులెన్స్‌లో గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. వేసవి తీవ్రత నానాటికి పెరుగుతున్న తరుణంలో పాడి పశువులను జాగ్రత్తలు కాపాడుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. వేడి వల్ల మూగజీవాలు అస్వస్థతకు గురైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచిస్తున్నారు.

పాల ఉత్పత్తి తగ్గకుండా..
ప్రస్తుతం ఎండల తీవ్రత అమాంతంగా పెరుగుతున్న తరుణంలో రైతులు పాడి బర్రెలు, ఆవులకు రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకోవాలి. షెడ్డును గడ్డితో కప్పుకోవాలి. అటు ఇటు సూర్యకిరణాలు పడకుండా తడిపిన జనుము సంచులను వేలాడదీయాలి. వాటిని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీటితో తడపాలి. పారాగడ్డి, పచ్చగడ్డి, ఎండు చొప్ప, వరి గడ్డి, మినుము, పెసర పొట్టు, వేరుశనగ పొట్టు అధికంగా వేయడం వల్ల పాల ఉత్పత్తి తగ్గదు. విటమినల్ మందులను కూడా ఇవ్వాలి.

ఉదయం 11 గంటలకు ఇంటికి..
ప్రతి రోజుపాడి పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో మార్పులు చేసుకోవాలి. ఉదయం 6గంటలకు మేతకు తీసుకెళ్లి 11 గంటలకే ఇంటికే ఇంటికి తీసుకురావాలి. సాయంత్రం పాలు పితికిన తర్వాత పచ్చిక బయళ్లల్లోకి తీసుకెళితే నీరసం వచ్చే అవకాశం ఉంది. బర్రె, ఆవులకు రోజు వేసే దాణా కంటే వేసవిలో అదనంగా పచ్చిగ్రాసం వేయాలి.


పాడి రైతులు సాగు చేసిన గ్రాసం

అందుబాటులో వైద్యం



వేసవిని దృష్టిలో ఉంచుకుని మూగజీవాలకు వైద్యం అందుబాటులో ఉంచాం. గాలికుంటు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నాం. పశువిజ్ఞాన బడి ద్వారా యజమానులకు అవగాహన కల్పించాం. పశువులకు అధికంగా నీళ్లు తాపాలి. వేడి గాలల నుంచి కాపాడుకోవాలి. మినరల్ మిక్చర్, విటమిన్ ఏడీఈ లిక్విడ్ అందుబాటులో ఉంచాం. పాడిపశువులకు ఆరోగ్యం బాగులేకపోతే 1962 నంబర్ ఫోన్ చేస్తే మా సిబ్బంది అంబులెన్స్‌లో వచ్చి వైద్య సేవలు అందిస్తారు. – **కమలాకర్ పశుసంవర్ధశాఖ ఏడీ పాణ్యం**

నేడు విద్యార్థుల తల్లిదండ్రులకు వర్క్ షాప్

కల్లూరు: కర్నూలు నగరంలోని హోటల్ ఫ్రైమ్‌ల్యాండ్, రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సారథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు స్కూల్ యాజమాన్యం శనివారం తెలిపింది. ప్రముఖ విద్యావేత్త ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కర్నూలు ప్రధాన సలహాదారు మండవ ప్రసన్న, ప్రజ్ఞాశాలి సుమితా భట్టాచార్య హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులనువారి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అవగాహన కల్పించనున్నారు.

కన్నమడకల వాసి ఉత్తరప్రదేశ్‌లో మృతి

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డే గూడు పెద్ద వెంకటస్వామి(65) కొన్నేళ్లుగా సంచార జీవనం చేసేవాడన్నారు. ఆరు నెలల క్రితం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లాడు. అక్కడ రైల్వే స్టేషన్లల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో శనివారం కొషిల్లా జిల్లా రైల్వే స్టేషన్‌లో రైలు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు అతని వద్ద ఉన్న ఆధారాలను బట్టి అక్కడి రైల్వే పోలీసులు ఓర్వకల్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వడ్డే పెద్ద వెంకటస్వామిగా గుర్తించిన పోలీసులు విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతునికి ఇద్దరు కొడుకులు సంతానం ఉన్నట్లు సమాచారం.